



వట్టేవాగు మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో జనసంద్రం (ఫైల్)

చిన్నచూపేనా..!

చింతలగట్టు మేడారంపై పట్టింపేది..?

- భక్తుల్లో అత్యధికులు ఆదివాసీలే..
- జాతరకు నాలుగు లక్షలకు పైగా రాక
- అయినా దేవాదాయ శాఖ జాబితాలో దక్కని చోటు
- నిర్వాహకులకు చందాలే దిక్కు

గూడూరు, జనవరి 2 : జిల్లాలో అతిపెద్ద గిరిజన, ఆదివాసీ జాతర వివక్షకు గురవుతోంది. మినీ మేడారంగా ఖ్యాతిగడించినా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ జాతరకు 4 లక్షల మంది భక్తులు వనదేవతల దర్శనం కోసం వస్తున్నా.. కనీసం దేవాదాయశాఖ గుర్తించడం లేదు. గూడూరు మండలంలోని చింతలగట్టు వట్టేవాగు సమ్మక్క-సారలమ్మల జాతర గత పది పర్యాయాలు భక్తులు అంద జేసిన విరాళాలతో అరకొర సౌకర్యాల మధ్య సాగింది. ఈసారి అదే పరిస్థితి! జాతరలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. స్నానాలు చేయడానికి, తాగునీటికి కటకటే. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో ఈ సారైనా సమ్మక్క-సారలమ్మ జాతరకు గుర్తింపు దక్కడంతో పాటు వసతులు కల్పిస్తారా? అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

మచ్చర్ల-దామరవంచ-జగన్నాయకుల గూడెం సరిహద్దు అటవీ ప్రాంతంలో చింతలగట్టు వట్టేవాగు సమ్మక్క-సారలమ్మ జాతర జరుగుతుంది. ఈ నాలుగు రోజులు భక్తులతో జనసంద్రంగా మారుతుంది. సుమారు 4 లక్షల మంది భక్తులు ఆ తల్లుల చెంతకు చేరుకొని, మొక్కులను సమర్పిస్తారు. గూడెపు సంప్రదాయాన్ని, ఆదివాసీ ఆచారాల్ని ప్రపంచానికి చాటుతాయి. అత్యంత గోప్యంగా నిర్వహించే ఆదివాసీ పూజా విధానం.. ఆ నాలుగు రోజుల పాటు చింతలగట్టు మేడారంలో జరిగే తీరూ ఆద్యంతం ఆసక్తికరం.

భక్తుల అవస్థలు..

ఆటవీ ప్రాంతంలో ఉండడంతో జాతరలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతారు. తాగునీటితో పాటు స్నానాలు ఆచరించడానికి నీటివసతి కరువుగా మారింది. ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించక పోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతర అభివృద్ధి ప్రజాప్రతినిధులు, అధికారులు ఇచ్చిన హామీలు అమలుకు నోసుకోవడం లేదు. పోయిన జాతరలో ఇచ్చిన హామీలకు జాతర సమీపిస్తున్నా అతీగతి లేకుండాపోయాయి. నిర్వహణకు ప్రతీసారి జాతర అభివృద్ధి కమిటీ సేకరించే విరాళాలతో అరకొర సౌకర్యాలు కల్పిస్తున్నారు. విద్యుత్ సౌకర్యం కూడా లేకపోవడంతో జనరేటర్ సాయంతో వెలుగులు ఏర్పాటు చేస్తున్నారు. తాగునీరు కూడా జాతర అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేస్తుంది. ఈ జాతరను దేవాదాయ శాఖ తన జాబితాలో లేకపోవడంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఆదివాసీ సంప్రదాయ పూజలు..

చింతలగట్టు మేడారంలో ఏటా జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర పూజతంతు ప్రత్యేకంగా ఉంటుంది. విగ్రహ రూపం లేని విధానాలకు పూర్తిగా భిన్నంగా జరుగుతుంది. మిగిలిన ఆలయాల్లో మాదిరిగా అక్కడ దేవతలు ఎప్పటికీ ఉండరు. జాతర జరుగుతున్న మూడురోజులు మాత్రమే దేవతలు అక్కడ ఉంటారు. వనదేవతలకు వనప్రవేశం చేయిస్తారు. నిజానికి మొక్కులు ఆ రోజుల్లో మాత్రమే చేయాలన్నది కోయ దొరల నమ్మకం. అయితే జన సమ్మర్థం ధాటికి తట్టుకోలేమని భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు జాతర మొదలు కాకముందు నుంచే చింతలగట్టు మేడారం వెళ్తుండటం గమనార్హం.

బెల్లమే బంగారం..

వనదేవతల పూజల కోసం భక్తులు బెల్లం ఉపయోగిస్తారు. దీనిని బంగారమని పిలుస్తారు. కోరిన కోరికలు తీరిస్తే తనఎత్తు బంగారాన్ని (బెల్లం) మీకు సమర్పించుకుంటానని భక్తులు సమ్మక్క, సారలమ్మకు మొక్కుకుంటారు. తమఎత్తు (బరువు) బంగారాన్ని తూకం వేసిన తర్వాత అందులో నుంచి కొంత మొత్తాన్ని తలమీద పెట్టుకుని దేవతల గద్దెల వద్ద ఉంచుతారు. కొంత తమతో ఇంటికి తీసుకెళ్లతారు. కొందరు ఎదురు కోళ్ల పేరుతో తమ మొక్కులను తీర్చుకుంటారు. కోళ్లకు దారం కట్టి, దేవతల గద్దెలకు అభిముఖంగా ఎగురవేస్తారు. సంతానం లేనివారు చిన్న ఊయలను చేసి తల్లులకు సమర్పించుకుంటారు.

వచ్చేనెల 21వ తేదీ నుంచి..

వచ్చేనెల 21వ తేదీన సమ్మక్క-సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు, నాగులమ్మకు పసుపు కుంకుమ మార్చుకోవడం కార్యక్రమం జరుగుతుంది. 22 వనదేవతలకు రహస్యపూజ, 23న వన దేవతలకు మొక్కులు చెల్లించుట. 24న ముగింపు వేడుక ఉంటుంది. ఈ సారైనా జాతరకు గుర్తింపు నిచ్చి నిధులు మంజూరు చేసి సౌకర్యాలు కల్పించాలని సమ్మక్క-సారలమ్మ జాతర కమిటీ, పూజారుల కమిటీ సభ్యులు ఇటీవల హైదరాబాద్‌లో మంత్రి సీతక్కను కలిశారు. జాతరకు రావాలని ఆహ్వాన పత్రికను అందించారు. సమస్యలపై చర్చించి సౌకర్యాలు కల్పించాలని విన్నవించారు.



వనం నుంచి సమ్మక్కను గద్దెకు తీసుకువస్తున్న దృశ్యం (ఫైల్)

సౌకర్యాలు కల్పించాలి..

సనుప వీరస్వామి, చింతలగట్టు సమ్మక్క-సారలమ్మ జాతర కమిటీ అధ్యక్షుడు, గూడూరు



చింతలగట్టు వట్టేవాగు సమ్మక్క-సారలమ్మ జాతరకు ప్రభుత్వం గుర్తింపు ఇచ్చి, నిధులు కేటాయించాలి. ఏటా సుమారు 4 లక్షలకు పైగా భక్తులు వస్తున్న ఈ జాతరకు ఎండోమెంట్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.

జాతరపై వివక్ష తగదు..

దారం సిద్ధు, పూజారుల కమిటీ అధ్యక్షుడు, గూడూరు



ఆదివాసీ, గిరిజన జాతర చింతలగట్టు వట్టేవాగు సమ్మక్క-సారలమ్మ జాతరపై ప్రభుత్వం వివక్షత తగదు. కనీసం విద్యుత్, తాగునీరు, స్నానాల గదులు ఏర్పాటు చేయాలి. భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలి. భక్తులు ఇచ్చే విరాళాలతోనే జాతర నిర్వహణ కొనసాగుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం జాతరను గుర్తించి నిధులు మంజూరు చేయాలి.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న రామారావు

టెన్త్ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

నెల్లికుదురు, జనవరి 2 : పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) రామారావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ఆలేరు జడ్పీఎస్ఎస్ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. రికార్డులను, మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, ఉత్తమ ఫలితాలు సాధించడానికి టీచర్లు కృషి చేయాలన్నారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా 3 గ్రూపులుగా విభజించి, బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీజీ మందుల శ్రీరాములు పాల్గొన్నారు.

తగ్గిన ధాన్యం రాబడులు

- ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సరుకు తగ్గుముఖం
- సమాంతరంగా మారిన ధరలే కారణం



కేసముద్రం మార్కెట్లో కాంటాలు నిర్వహిస్తున్న కార్మికులు

కేసముద్రం మార్కెట్‌కు వచ్చిన ధాన్యం రాబడులు

తేదీ	బస్తాలు
2023, డిసెంబర్	
21న	22,116
22న	5,427
27	7,973
28	8,849
29	10,802
2024, జనవరి, 2న	11,815

కేసముద్రం, జనవరి 2 : ఈ సీజన్‌లో కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం సరుకు రాబడులు తగ్గుముఖం పట్టాయి. నిత్యం 15 వేల నుంచి 20 వేల బస్తాల సరుకు రాగా, గత నెల ఆరంభంలో ఏకంగా 30 వేల బస్తాల చొప్పున వారం పాటు రాబడులు కొనసాగాయి. గతనెల చివరి వారంలో 7వేల నుంచి 9600 బస్తాల మధ్యనే వడ్లను రైతులు విక్రయించేందుకు తీసుకువచ్చారు. తాజాగా మంగళవారం 11,815 బస్తాల ధాన్యాన్ని 249 మంది రైతులు అమ్మకానికి మార్కెట్‌కు తీసువచ్చారు. ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ-నామ్) విధానంలో హెచ్ఎంటీ రకం ధాన్యం క్వింటాకు గరిష్ఠంగా రూ.3,275, క నిష్ఠంగా రూ.1,992, సగటున రూ.2,871, జైశ్రీరాం రకం ధాన్యం గరిష్ఠంగా రూ.3211, కనిష్ఠంగారూ.2016, సగటున రూ.2759, ఆర్ఎన్ఆర్ రకం ధాన్యం గరిష్ఠంగా రూ.3011, కనిష్ఠంగా రూ.2001, సగటున రూ.2862 ధరల చొప్పున వ్యాపారులు ఖరీదులు చేశారు. అధికంగా ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ రకాల ధాన్యం విక్రయానికి వస్తున్నాయి. అయితే క్రితం మార్కెట్ అయిన గతనెల 29న 10,802 బస్తాలు అంతకు ముందు 28న 8849 బస్తాల సరుకు మార్కెట్‌కు వచ్చింది. గత నెల మొదటి వారంలో ధాన్యం సగటు ధర రూ.3200 నుంచి రూ.3350 వరకు ధరలు నమోదు అయ్యాయి. ఇతర మార్కెట్ల కంటే ఇక్కడ ధరలు అధికంగా ఉండడంతో కేసముద్రం మార్కెట్‌కు ధాన్యం పోటెత్తింది. ఇతర జిల్లాల నుంచి సైతం రైతులు ఇక్కడి ధాన్యం తీసుకురావడంతో నిత్యం 30వేల బస్తాలకుపైగానే ధాన్యం వచ్చింది. గతనెల చివరి వారంలో ఇక్కడి నుంచి ధాన్యం ఎగుమతులు నిలిచిపోవడం ధరలు తగ్గి క్వింటాకు రూ.2,700 నుంచి రూ.2,860 వరకు చేరి ఇతర మార్కెట్లలో మాదిరిగానే సమాంతరంగా ధరలు మారాయి. దీంతో గతనెల 21వ తేదీ నుంచి ధాన్యం రాబడులు తగ్గుముఖం పట్టాయి. ఏదేమైనా ధాన్యం ధర ఒక్కసారిగా లేచి రైతులను ఊరించి వారంలో అమాంతం పడిపోయింది.



తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రి

అభివృద్ధి పనులు ముందుకు సాగేనా, ఆగేనా?

- హడావుడి ప్రారంభాలు, ప్రస్తుత ఎమ్మెల్యే ఆదరించేనా..
- విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- కేటాయింపు కాని డబుల్ ఇళ్లు, పూర్తికాని రహదారులు

వివరాలు 7లో..

ప్రజలకు అవగాహన కల్పించాలి : కలెక్టర్

బయ్యారం, జనవరి 2 : ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయహస్తానికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణలో పూరింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. కొత్తపేట గ్రామపంచాయతీలో మంగళవారం జరిగిన ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. దరఖాస్తు దారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు కౌంటర్లతో పాటు తదితర ఏర్పాట్లు చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. 'ఆన్‌లైన్' చేసేటప్పుడు ఇబ్బందులు కలగకుండా పూరించిన దరఖాస్తులను ఒకటికి రెండుసార్లు జాగ్రత్తగా వెరిఫై చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేస్తూ అపోహలను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాతా గణేష్, సర్పంచ్ ఇర్ప మమత, మండల ప్రత్యేక అధికారి రాజా నరేందర్, బాలరాజు, ఎంపీడీవో సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

బయ్యారం సెంటర్ పరిశీలన..

మండల కేంద్రంలోని గాంధీ సెంటర్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆంగోత్ బిందు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాటు చేయాలని, కేంద్రానికి వచ్చే వారి కోసం తగు సౌకర్యాలు సమకూర్చాలన్నారు. ప్రతీ ఒక్కరు దరఖాస్తు చేసుకొని ప్రభుత్వం కల్పించే లబ్ధి పొందాలని ప్రజలకు సూచించారు. తహసీల్దార్ ఇమానీయల్, ఎంపీడీవో సత్యనారాయణ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



కొత్తపేటలో దరఖాస్తు ఫారాన్ని పరిశీలిస్తున్న శశాంక

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి

తొర్రూరు, జనవరి 2 : ఉపాధ్యాయులతో పాటు విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి అన్నారు. మంగళవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి హాజరైన ఎమ్మెల్యే సంఘం నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీఆర్సీ, ఐఆర్ విషయంలో ఉపాధ్యాయులకు మేలు జరిగేలా సమస్యల పరిష్కారానికి కృషి చేసే విధంగా విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఆమె హామీ ఇచ్చారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.సుధాకరాచారి, ప్రధాన కార్యదర్శి యాకూబ్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు చంద్రప్రకాశ్, ప్రభాకర్‌రావు, చంద్రమౌళి, రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి..


నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. తొర్రూరులోని మిషన్ భగీరథ భవనంలో పంచాయతీరాజ్, ఇరిగేషన్, భగీరథ, రవాణా, ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్, ఏఈ వెంకటేశ్వర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న యశస్విని రెడ్డి









ఐనవోలు జాతర ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్

ఐనవోలు, జనవరి 2: ఐనవోలు జాతర ఏర్పాట్లను దేవదాయధర్మదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ పరిశీలించారు. మంగళవారం ఆలయానికి వచ్చిన కమిషనర్ అధికారులతో సమావేశమై జాతర ఏర్పాట్లను ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావును అడిగి తెలుసుకున్నారు. జాతరలో ఎలాంటి లోటు పాట్లు జరుగకుండా భక్తులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అంతకు ముందు కమిషనర్ స్వామి వారిని దర్శించుకోగా అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. డిప్యూటీ కమీషనర్ టి. శ్రీకాంత్‌రావు, అసిస్టెంట్ కమీషనర్ ఆర్. సునీత, అధికారులు సంజీవరెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతర పార్కింగ్.. క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ

ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర పార్కింగ్ క్యూలైన్ల ఏర్పాట్లను ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ అధికారులతో కలిసి పరిశీలించారు. మామునూరు ఏసీపీ సతీష్, పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై నవీన్‌కుమార్‌లతో కలిసి ఆలయ పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. భక్తులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఆలయానికి వచ్చే నాలుగుదారులకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ స్థలాలతోపాటు క్యూలైన్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. సకాలంలో పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకరావాలని తెలిపారు.


స్వామి వారిని దర్శించుకుంటున్న కమిషనర్ అనిల్‌కుమార్

అభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి

- ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

నయింనగర్, జనవరి 2: అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో మంగళవారం వివిధ శాఖల డైరెక్టర్లు, ఐఎన్‌టియూసీ-327 యూనియన్ నాయకులు సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా పరిపుష్టిగా కంపెనీ ఉండాలంటే అందరూ కలిసికట్టుగా పని చేసి లక్ష్యాలను పూర్తి చేయాలని తెలిపారు. వినియోగదారులను గౌరవించడం వారి సమస్యలను పరిష్కరించడం ఏటి అండ్ సి నష్టాలను తగ్గించాలని ఆయన కోరారు. విద్యుత్ భద్రతా సూచనలు ఉద్యోగస్తులు, వినియోగదారులు విధిగా పాటిస్తూ విద్యుత్ ప్రమాదాలను నివారించాలని ఆయన తెలిపారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్‌రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పిమోహన్‌రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్ధన్, ఐఎన్‌టియూతీ-327 యూనియన్ నాయకులు మహేందర్‌రెడ్డి, బుచ్చయ్యగౌడ్, నీలారావు శ్రీనివాస్, ఓదేలు, సోమయ్య, సీజీయంలు, జీయంలు పాల్గొన్నారు.


సీఎండీ వరుణ్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్లు














అభివృద్ధి పనులు ముందుకు సాగేనా, ఆగేనా?

హడావుడి ప్రారంభాలు, ప్రస్తుత ఎమ్మెల్యే ఆదరించేనా..

- విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- కేటాయింపు కాని డబుల్ ఇళ్లు, పూర్తికాని రహదారులు


తొర్రూరు మండలం గోపాలగిరిలో ఆయిల్ పామ్ పరిశ్రమ జరిగే స్థలం, శిలాఫలకం (ఫైల్)

తొర్రూరు రూరల్ (మహబూబాబాద్ జిల్లా), జనవరి 2 : పాలకుర్తి నియోజకవర్గానికి కేంద్రంగా ఉంటూ అన్నిరంగాల్లో దినదినాభివృద్ధి చెందుతున్న తొర్రూరు మండలం ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరుగలేదు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకుర్తి నియోజకవర్గంగా ఏర్పడిన నాటి నుంచి ఎస్.సుధాకర్ రావు, దుగ్యాల శ్రీనివాసరావు ఎమ్మెల్యేలుగా కొనసాగినా స్వరాష్ట్రంలో 2014, 2018 సంవత్సరంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా కొనసాగుతూ కొంతమేర అభివృద్ధి చేసినప్పటికీ ఆశించిన మేరకు కాలేదు. దీంతో 2023 అసెంబ్లీ ఎన్నికలు సమీపించడంతో తొర్రూరు మండలంలో కోట్లాది రూపాయల పనులకు హడాహుడిగా శంకుస్థాపనలు చేసి, ఎర్రబెల్లి ఓడిపోయారు. శంకుస్థాపన పనులు జరిగిన అభివృద్ధి పనులు ముందుగు సాగేనా, నూతనంగా గెలుపొందిన ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తొర్రూరు మిని ట్యాంకు బండ్, విద్యావైద్యం, బెడ్రూం ఇళ్లు, రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరముంది.

మినీట్యాంకు బండ్, ఆయిల్‌పామ్ పరిశ్రమ పూర్తి అయ్యేనా..?

తొర్రూరు పెద్దచెరువును మినీట్యాంకు బండ్ చేస్తామంటూ 2017-18 సంవత్సరంలో గత ప్రభుత్వం రూ.3 కోట్ల 60 లక్షల నిధులను మంజూరు చేసింది. బండ్ పనులకు హడావుడిగా టెండర్లు పిలిచారు. దీంతో రూ.2 కోట్ల 19 లక్షలతో కాంట్రాక్టర్లు కట్ట మరమ్మతులు, బ్రిడ్జి నిర్మాణం కోసం పిల్లర్లు, పూడికతీత వంటి పనులు చేసి వదిలేశారు. మొత్తంగా బతుకమ్మ ఘాట్, బ్రిడ్జి నిర్మాణం చేయాల్సి ఉన్నా అటువైపు కన్నెత్తి చూడటం లేదు. పూర్తిస్థాయిలో ట్యాంక్ బండ్ నిర్మాణం కావాలంటే అధిక నిధులు కావాల్సి ఉంటుందంటూ అందుకనుగుణంగా స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరువ చూపి త్వరితగతిన పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నూనెగింజల ఉత్పత్తి చేయాలనే లక్ష్యంగా ఆయిల్‌ఫాం పంట సాగుకు సబ్సిడీ ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహించింది. అందులో భాగంగానే పంటను విక్రయించుకోవడానికి రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకూడదని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో తొర్రూరు మండలం గోపాలగిరి గ్రామంలో 111 సర్వేనెంబర్‌లో సుమారు 85 ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు గుర్తించి ఆయిల్ ఫెడ్ సంస్థకు అప్పగించారు. అందులో 45 ఎకరాల్లో రూ.175 కోట్ల నిధులతో అత్యాధునికమైన పరిశ్రమను ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావడం కోసం ఎర్రబెల్లి దయాకర్ రావు సెప్టెంబరు 2023న ప్రారంభించారు. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లాలో వెయ్యికి పైగా రైతులు 4,769 ఎకరాలలో పామాయిల్ సాగు కొనసాగతుండగా, 2023-24కుగాను 8 వేల ఎకరాల పంట సాగు చేయడానికి లక్ష్యంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. వచ్చే ఏడాది కొంత పంట చేతికి వచ్చే సమయానికి పరిశ్రమను అందుబాటులోకి తీసుకురావాలని ఆయిల్‌ఫాం రైతులు కోరుతున్నారు.

ఇళ్ల కేటాయింపు చేయాలి

తొర్రూరు మండలంలోని పేద ప్రజల సంక్షేమానికి ఇళ్లు లేనిపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తామని చెప్పడంతో కేటాయింపుల కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించినా కేటాయింపులు చేయలేదు. గృహలక్ష్మీ పథకం కింద రూ.5లక్షలు ఇస్తామనడంతో సుమారు 3,418 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. తొర్రూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని సుమారు 900 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు కాగా, 200 మంది లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించారు. అయితే కర్కాల, కంఠాయపాలెం, గుర్తూర్, మాటేడు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి అయినా లబ్ధిదారుల ఎంపిక చేకపోవడంతో నిరుపయోగంగానే ఉన్నాయి. గుర్తూర్ గ్రామంలో 40 ఇళ్లకుగాను 20, కర్కాల గ్రామంలో 20 ఇళ్లు పూర్తైనా లబ్ధిదారుల కేటాయింపు చేయకపోవడంతో ప్రజలు వెళ్లి ఉంటున్నారు. ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా తొర్రూరు మండలంలోని కర్కాల గ్రామంలో పాలేరు వాగు పై బ్రిడ్జి, గుర్తూర్ -ఎర్రబెల్లి గూడెం గ్రామాల మధ్య ఆకేరు వాగు పై నిర్మించే బ్రిడ్జి నిర్మాణాలకు నిధులు కేటాయించి శంకుస్థాపన చేశారు. అయితే గుర్తూర్‌లో నిర్మించే బ్రిడ్జి నిర్మాణానికి రూ.12 కోట్ల 64 లక్షలకు టెండర్లు పిలిచి ఓపెన్ చేయలేదు. గుర్తూర్ గ్రామం నుంచి మడిపల్లి, ఫత్తేపురం, తొర్రూరు వచ్చే రహదారి నిర్మాణం పనులు ప్రారంభించి వదిలేశారు. గోపాలగిరి, చెర్లపాలెం మధ్య రహదారి, చింతలపల్లి, కొమ్మనపల్లి గ్రామాల మధ్య ఉన్న రహదారి, మున్సిపాలిటీలో పలు కాలనీల్లో కంకరపోసి వదిలేశారు. మండల వ్యాప్తంగా ఉన్న సమస్యలను పరిష్కరించడం కోసం స్థానిక ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


మినీట్యాంకు బండ్ కోసం ఫిల్లర్ల నిర్మాణంకే పరిమితమైన తొర్రూరు పెద్ద చెరువు


తొర్రూరు మండలం గుర్తూర్ గ్రామంలో పూర్తి అయిన డబుల్‌బెడ్రూం ఇళ్లు

వంద పడకల ఆస్పత్రి కోసం ఎదురుచూపులు..

తొర్రూరు మండలంలో గతంలో ప్రస్తుత ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అత్తామామలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి, రాజేందర్ రెడ్డి దంపతులు సొంత ఖర్చులతో నిర్మించిన 30 పడకల ఆస్పత్రి మాత్రమే ఉంది. రోగుల తాకిడితో ఆస్పత్రి భవనం సరిపోకపోవడంతో వంద పడకల ఆస్పత్రి కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఎన్నికల సమయంలో వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేసి తొర్రూరు, మరిపెడ మండలాలకు సంబంధించి వంద పడకల ఆస్పత్రిని మరిపెడ మండల కేంద్రంలో అప్పట్టి వైద్యఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు ప్రారంభించారు. వంద పడకల ఆస్పత్రికి సుమారు 3 ఎకరాల స్థలం అవసరం ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో స్థల సేకరణ చేయాల్సి ఉంది. అప్‌గ్రేడ్ అయినా ఆ స్థాయిలో వైద్యపరీక్షలు మాత్రం అందకపోగా, కనీసం ఆస్పత్రిలో గైనకాలజిస్టు, పిల్లల వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఎంబీబీఎస్ వైద్యులు నామమాత్రంగా చూస్తున్నారు. గ్రామీణ ప్రాంతా ప్రజలు ప్రత్యేక వైద్యనిపుణుల కోసం వరంగల్, ఖమ్మంతో పాటు ప్రసవాలకు వర్ధన్నపేట, వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రికి వెళ్తున్నారు. అదేవిధంగా తొర్రూరు, పెద్దవంగర మండలాల నుంచి డిగ్రీ విద్యను పూర్తి చేసి ఉన్నత విద్యను అభ్యసించడానికి పీజీ, బీఈడీ, ఇంజనీరింగ్ కళాశాల లేకపోవడంతో వరంగల్, హైదరాబాద్, ఖమ్మం ఇతర ప్రాంతాలకు వెళ్లి విద్యనభ్యసించే ఆర్థిక పరిస్థితి లేని పేద విద్యార్థులు మధ్యలో చదువులు మానేస్తున్నారు. ఇప్పటికైనా విద్య, వైద్యం పై ప్రత్యేక దృష్టిసారించాలని విద్యార్థులు, మేధావులు కోరుతున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే నాయిని


కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హనుమకొండ రూరల్, జనవరి 2 : కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నిరుపేద విద్యార్థుల కోసం ఎమ్మెల్యే నోట్‌బుక్స్ అందజేశారు. విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేసినందుకు ఎమ్మెల్యేకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఇవి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నెలాఖరులోగా రైస్ మిల్లర్లు లక్ష్యాన్ని పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

హనుమకొండ రూరల్, జనవరి 2 : పెండింగ్‌లో ఉన్న రైస్ మిల్లుల యాజమాన్యం గడువులోగా ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ధేశించిన గుడువులోగా రైస్ మిల్లర్లు బియ్యానికి సంబంధించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఖరీఫ్‌లో వచ్చిన ధాన్యం నుంచి రావాల్సిన బియ్యం పలు మిల్లుల నుంచి ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, ఈ నెల 31వ తేదీలోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మీ, డీఎం మహేందర్, సివిల్ సప్లయీస్ డీటీలు రమేశ్, కృష్ణ, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 17 మంది డీబార్

కేయూ క్యాంపస్, జనవరి 2 : కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన 17 మందిని తనిఖీ అధికారులు డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎం.తిరుమలదేవిలు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల పరీక్షల కేంద్రాల్లో మాల్ ప్రాక్టీస్ పాల్పడిన ఐదుగురిని, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని కళాశాలలో 8 మందిని, ఉమ్మడి ఖమ్మంలో జిల్లాల పరిధిలోని కళాశాలల్లో మరో 4 మంది డీబారైనట్లు తెలిపారు.

కేయూలో ఇద్దరికి బోధనేతర కారుణ్య ఉద్యోగాలు

కేయూ క్యాంపస్, జనవరి 2 : కాకతీయ యూనివర్సిటీలో ఉద్యోగ విధుల్లో పని చేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు బోధనేతర సిబ్బంది ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలలో భాగంగా ఇద్దరికీ ఉద్యోగాలు కల్పించారు. ఈ మేరకు మంగళవారం కేయూ సెనెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పరీక్ష విభాగంలో పనిచేస్తూ మృతి చెందిన నారగోని వెంకన్న కుమారుడు నారగోని శివాజీ గౌడ్‌కు క్లర్క్ కం టైపిస్టుగా, అలాగే సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పనిచేసిన బస్కుల పోచయ్య కుమారుడు బస్కుల సునిల్‌కు కామాటిగా వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఉద్యోగ నియమాకాల పత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు, ఇతర ఉద్యోగ సంఘాల నేతలు, వర్సిటీ ఉద్యోగులుపాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

హనుమకొండ క్రైం, జనవరి 2 : హనుమకొండ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ జిల్లా న్యాయమూర్తి రమేష్ మంగళవారం తీర్పు వెల్లడించారు. హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి. జీతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. డిసెంబరు 31, జనవరి 1న రాత్రి హనుమకొండ పరిధిలోని కుమార్‌పల్లి, కేయూ జంక్షన్, అశోక జంక్షన్, పెద్దమ్మగడ్డ ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో సుమారు 75 మందిని మద్యం తాగినట్లు గుర్తించి మంగళవారం కోర్టుకు తరలించారు. వీరిలో వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నారాయణతండాకు చెందిన అజ్మీర ప్రకాశ్, వరంగల్ దేశాయిపేటకు చెందిన తమ్మిశెట్టి తిరుపతిలకు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. ఇంకా 73 మందికి రూ. 1.22 లక్షల జరిమానా విధించారు. జైలు శిక్ష పడిన వారిని కోర్టు హెడ్‌కానిస్టేబుల్ రాచకొండ రమేష్ పరకాల జైలు అధికారులకు అప్పగించారు.

ఉపాధి శిక్షణ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు

మడికొండ, జనవరి 2: మడికొండ వ్యాసపురి కాలనీలోని వేదవ్యాస పబ్లిక్ స్కూల్ ఆవరణలో సేవా భారతి, గోద్రేజ్ ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం కౌశలం సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ నిర్వాహకులు రాసమల్ల మహేష్ తెలిపారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ పేరుతో ఎయిర్ కండీషనర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, మైక్రోవేవ్ ఓవెన్ తదితర గృహోపకరణ వస్తువుల రిపేరులో శిక్షణ ఇచ్చి అనంతరం వారికి గోద్రేజ్, రిలయన్స్, ఐఎస్ఫ్బీ వంటి ప్రముఖ కంపెనీలలో ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. మూడు నెలల పాటు నిర్వహించే శిక్షణలో ఆసక్తి గల నిరుద్యోగ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 90599 07740 నెంబర్‌లో సంప్రదించాలని మహేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సమ్మిరెడ్డి,జెడ్‌పీటీసీ సరిత,సర్పంచ్ రాజీరెడ్డి,ఎంపీటీసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

7న డీటీయూ ఆవిర్భావ సభ

డీటీయూ రాష్ట్ర నేత దామెర ఉపేందర్


డీటీయూ ఆవిర్భావ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బాధ్యులు

వడ్డెపల్లి, జనవరి 2: మహానీయులు గౌతమ బుద్ధుడు, మహాత్మా జ్యోతి రావుపూలే, సావిత్రిబాయి పూలే, జాన్ డ్యూయి ఎడ్యుకేషనల్ ఫిలాసఫర్, బీఆర్. అంబేద్కర్ అందించినటువంటి జ్ఞాన వారసత్వాన్ని కొనసాగిస్తూ వారి ఆలోచన విధానంలో పనిచే యడం కోసం ఈ నెల 7న హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని ఎస్‌వీకే కన్వెన్షన్ హాల్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల నాయక త్వంలో ధర్మ టీచర్స్ యూనియన్ (డీటీయూ) ఆవిర్భావ సభను నిర్వహించనున్నట్లు డీటీయూ రాష్ట్ర నేత దామెర ఉపేందర్ తెలిపారు. మంగళవారం రాంనగర్‌లో నిర్వహించిన డీటీయూ ఆవిర్భావ సన్నాహక కమిటీ బాధ్యుల సమావేశంలో ఆవిర్భావ సభకు సంబంధించిన వాల్ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 80 వేల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని అన్నారు. మహానీయుల ఆలోచనలతో ధర్మ టీచర్స్ యూనియన్‌ను రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేయడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉపాధ్యాయులు సంఘటితం కావల్సిన సమయం ఆసన్న మైందని పేర్కొన్నారు. ఆవిర్భావ సభకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. డీటీయూ ఆవిర్భావ బాధ్యులు సాంబయ్య, శ్యాంసుందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

తొర్రూరు(మహబూబాబాద్ జిల్లా), జనవరి 2: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తరలిస్తున్న గోవులను మంగళవారం సాయంత్రం డివిజన్ కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నిర్వాహకులు పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎస్సై జగదీష్ తెలిపిన ప్రకారం వేములవాడ గోశాల నుంచి మండలంలోని జీకే తండాకు 20గోవులను తరలించేందుకు పర్మిట్ తీసుకుని దారిమళ్లించి హైదరాబాద్‌కు తరలిస్తుండటంతో గోశాల నిర్వాహకులు పట్టణ శివారులో పట్టుకోవడం జరిగిందన్నారు. డీసీఎం నంబర్ టీఎస్ 30 టీఏ0850 లో తనిఖీ చేయగా 24గోవులు ఉన్నాయన్నారు. డీసీఎంలో ఉన్న ఎల్. భాస్కర్, ఎ. సంతోష్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైల్వే గేటు మూసివేత

కమలాపూర్, జనవరి 2 : హసన్‌పర్తి-ఉప్పల్ రైల్వేస్టేషన్‌ల మధ్య గల ఎల్కతుర్తి మండలంలోని బావుపేట రైల్వే గేటు (నెంబరు 9ఈ) ఈ నెల 4, 5వ తేదీ వరకు రెండు రోజుల పాటు గేటు మూసివేయనున్నట్లు కాజీపేట రైల్వే సీనియర్ సెక్షన్ అధికారి జీపీ.సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపూర్-హనుమకొండ వెళ్లే మార్గం లోని ఏకైక గేటు కావడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని ఆయన సూచించారు. కాగా హసన్‌పర్తి-ఉప్పల్ రైల్వే స్టేషన్‌ల మధ్య కొత్తగా వేసిన మూడో రైల్వె లైన్ ట్రాఫిక్, పవర్ బ్లాకింగ్ అనుసంధాన పనుల వల్ల సికింద్రాబాద్ నుంచి కాగజ్ నగర్ మార్గంలో నడిచే అన్ని ప్యాసింజర్ రైళ్లు ఈ నెల 13వ తేదీ వరకు రద్దు చేయబడ్డాయని, కేవలం హైదరాబాద్-కాగజ్‌నగర్ మధ్య నడిచే ఇంటర్‌సిటీ ట్రైన్ నెంబరు అప్ 17011, డౌన్ 17012 మాత్రమే నడుస్తుందని రైల్వే అధికారులు తెలిపారు.

ఉచిత ప్రయాణంతో అద్దె బస్సులకు డీజిల్ భారం

- హైర్ బస్సు ఓనర్స్ వరంగల్ యూనిట్ రీజినల్ అధ్యక్షుడు రాంరెడ్డి
- ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేత


ఆర్ఎం శ్రీలతకు వినతిపత్రం అందజేస్తున్న హైర్ బస్సు ఓనర్స్ వరంగల్ యూనిట్ నాయకులు

సుబేదారి, జనవరి 2: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో అద్దె బస్సులకు డీజిల్ భారం పెరిగిందని హైర్ బస్సు ఓనర్స్ వరంగల్ యూనిట్ రీజినల్ అధ్యక్షులు మారిపెల్లి రాంరెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని ఆర్టీసీ రీజియన్ కార్యాలయంలో పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని హైర్ బస్సు ఓనర్స్ వరంగల్ యూనిట్ ఆధ్వర్యంలో ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జె. శ్రీలతకు అందజేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ మహాలక్ష్మీ పథకానికి ముందు బస్సులలో 45 నుండి 60 మంది వరకు ప్రయాణికులు ప్రయాణించేవారని, ఇప్పుడు ఉచిత బస్సు పథకంతో ఆ సంఖ్య గణనీయంగా పెరిగి బస్సుల టైర్లపై భారం పడుతుందన్నారు. అలాగే బస్సుల కమాన్ పట్టీలు విరుగుతున్నాయని, బస్సు మెయింటెనెన్స్ విపరీతంగా పెరుగుతుందన్నారు. ఓవర్‌లోడ్ కారణంగా కేఎంపీఎల్ బాగా తగ్గిపోయిందని, దీనివల్ల 4.5 కేఎంపీఎల్ ఇవ్వాలన్నారు. జనవరి 5వ తేదీలోగా మా సమస్యలు పరిష్కరించాలని, లేదంటే 5 నుంచి సమ్మె చేస్తామని ఆర్ఎంకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నట్లు రాంరెడ్డి, తెలిపారు. ఆర్ఎంకు వినతిపత్రం అందజేసినవారిలో హైర్ బస్సు ఓనర్స్ రాష్ట్ర నాయకులు లక్కం ప్రభాకర్, కె. సదానందం, వెంకటేశ్వర్లు, పి. కుమార్, వి. వెంకట్‌రెడ్డిలు ఉన్నారు.

కారు ఢీకొని బాలుడి మృతి

- మహబూబాబాద్ జిల్లా ముత్యాలమ్మగూడెం స్టేజీ వద్ద ఘటన


విజయ్‌ప్రకాష్ (ఫైల్)

మహబూబాబాద్‌రూరల్, జనవరి 2 : కారు ఢీకొన్న ఘటనలో ఎనిమిదేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు ముత్యాలమ్మగూడెం స్టేజీ వద్ద మంగళవారం మధ్యాహ్నం చోటుచోటు చేసుకుంది. మానుకోట రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. గూడూరు మండలం మచ్చర్లకు చెందిన చింతల వినోద-సుధాకర్ దంపతులు హైదరాబాద్‌కు వలస పోయి కూలీనాలీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వారికి ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు విజయ్‌ప్రకాష్ (8) అదే గ్రామంలోని అమ్మమ్మ ఈసం నర్సమ్మ వద్ద ఉంటూ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. వారం రోజుల క్రితం సెలవులు రావడంతో హైదరాబాద్‌లోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లాడు. సోమవారం రాత్రి మహబూబాబాద్‌కు చేరుకున్న కుటుంబసభ్యులు రాత్రి కావడంతో ముత్యాలమ్మగూడెంలోని వారి బంధువుల ఇంటికి వెళ్లారు. తర్వాత మంగళవారం మధ్యాహ్నం మచ్చర్లకు వెళ్లేందుకు ముత్యాలమ్మగూడెం స్టేజీ వద్ద ఆటో ఎక్కుతున్న క్రమంలో చెన్నారావుపేట నుంచి కురవికి వెళ్తున్న కారు ఆటోకు కుడివైపున ఉన్న బాలుడు విజయ్‌ప్రకాష్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తమ కళ్లముందే కుమారుడు మృతి చెందడంతో వారు ఒక్కసారిగా షాక్ గురయ్యారు. కొద్దిసేపట్లో స్వగృహానికి వెళ్లాల్సిన బాలుడు అనంతలోకాలకు వెళ్లడంతో కుమారుడి మృతదేహంపై పడి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మృతుడి తండ్రి సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికరెడ్డి తెలిపారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు చివరి గడువు

హనుమకొండ రూరల్, జనవరి 2 : ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో ఇంటర్మీడియేట్ చదువుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఎవరైనా పరీక్ష ఫీజు చెల్లించనట్లయితే బుధవారం రూ.2500 అపరాధ రుసుంతో చెల్లించవచ్చని జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి ఏ.గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, కళాశాల యాజమాన్యం ఈ విషయాన్ని గమనించి ఇంటర్ వార్షిక ఫీజు చెల్లించాలని సూచించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

- మృతురాలి బంధువుల ఆందోళన
- ధర్మారంలో ఉద్రిక్తత


లక్ష్మీ (ఫైల్)


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న లక్ష్మీ బంధువులు

పరకాల, జనవరి 2 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన నడికూడ మండలం ధర్మారంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నడికూడ మండలం ధర్మారం గ్రామానికి చెందిన నక్క లక్ష్మి (40), ఎర్రన్న దంపతులకు 13ఏళ్ల క్రితం వివాహం జరిగింది. భర్తతో గొడవపడి లక్ష్మి ఐదేళ్లుగా వేరే ఇంట్లో కిరాయికి ఉంటోంది. డిసెంబరు 28న రేషన్ కార్డు విషయమై తన భర్త ఎర్రన్న ఇంటికి వెళ్లి మాట్లాడి తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామంలోని బొడ్రాయి వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. బంధువులు, స్థానికులు గమనించి వెంటనే 108 ద్వారా ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. లక్ష్మి చికిత్స పొందుతూ జనవరి 1 (సోమవారం) మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం లక్ష్మీ మృతదేహాన్ని తన భర్త ఎర్రన్న ఇంటి ముందు వేసి బంధువులు రహదారిపై ధర్నా చేశారు. కొన్నేళ్లుగా ఎర్రన్న లక్ష్మీని పట్టించుకోలేదని, ఎర్రన్న ఆస్తిని లక్ష్మీ కూతురు పేరు మీద రాయాలని ఆందోళన చేశారు. ఎర్రన్న లక్ష్మీని ఇబ్బందులకు గురిచేసి కూతురు ఉన్నా వేరే పెళ్లి చే సుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మీ కుటుంబానికి న్యాయం చేయాలని నినాదించారు. మూడు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించడంతో పరకాల సీఐ వెంకటరత్నం, ఎస్సై లు సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి బంధువుల ను సముదాయించేందుకు ప్రయత్నించారు. అయినా లక్ష్మీ బంధువులు వినకపోవడంతో పోలీసులు బలవంతంగా లాక్కెళ్లారు. మహిళలను పక్కకు నెట్టివేయడంతో గ్రామ సర్పంచ్ గోల్కొండ ఉమ, ఆమె భర్త సదానందం సీఐతో వాగ్వాదానికి దిగారు. మహిళలను నెట్టివేయడం సరికాదన్నారు. చివరకు పరారీలో ఉన్న లక్ష్మీ భర్త ఎర్రన్నను తీసుకువస్తామని సీఐ హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.

ప్రజాసమస్యలను పరిష్కరించడమే కాంగ్రెస్ లక్ష్యం

- పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే నాగరాజు


నందనం గ్రామసభలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు, జనవరి 2: ప్రజాసమస్యలను పరిష్కరిస్తూ సంక్షేమ ఫలాలను అర్హులందరికి అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. ప్రజాపాలనలో భాగంగా మంగళవారం నందనంలో జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ ఐదు గ్యారంటీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తులు ఇవ్వని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం మరిన్ని రోజుల గడువు ఇవ్వడానికి కృషిచేస్తుందన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములు, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీవో రఘుపతిరెడ్డి, సర్పంచ్ యాకర మంజులయాదగిరి, ఎంపీటీసీ జెట్టబోయిన లక్ష్మి, ఉప సర్పంచ్ మౌనికరాము, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ నాయకులు పెన్నులు, పెన్సిళ్ల ఎమ్మెల్యేకు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో అనారోగ్యానికి గురైన వారిని పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు బండి సంపత్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉన్నత, ప్రాథమిక పాఠశాలలోని సమస్యలను విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలోని గుంతలను పరిశీలించిన ఎమ్మెల్యే ముందుగా వాటిని పూడ్చి వేయాలని అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ అధికారులతో కలిసి పాఠశాలల్లోని సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అడిషినల్ కలెక్టర్ మహేందర్‌జీకి సూచించగా పాఠశాలలను సందర్శించి నివేదికను అందజేస్తామని తెలిపారు. నందనంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఫ్లెక్సీల వివాదం తలెత్తి ఫ్లెక్సీలను చింపి తొలగించారు. ఎమ్మెల్యే తొలి సారి ప్రజాపాలన కార్యక్రమంలో గ్రామానికి వస్తున్నాడని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల ఎన్నికల ముందు పార్టీలో చేరినవారితోపాటు స్థానికంగా ఉండని వారు ఫ్లెక్సీల్లో తమ ఫోటోలను పెద్దవిగా ముద్రించుకొని సీనియర్ల ఫోటోలు పెట్టలేదని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఫ్లెక్సీల వివాదానికి తెరతీసి చింపివేశారు. ఎమ్మెల్యే వస్తే పరువుపోతుందని గ్రామ పార్టీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో ఫ్లెక్సీలను మొత్తం తొలగించి వివాదానికి తెరదించారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రత్యేక తరగతుల షురూ


కురవి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 2 : జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 104, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు 15, మోడల్ స్కూల్స్ 8 వెరసి 127 పాఠశాలలుండగా వాటిల్లో 4405 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారిలో బాలురు 2296, బాలికలు 2109 మంది మార్చి 18న ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు కొనసాగనున్న వార్షిక పరీక్షలకు హాజరుకానున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ప్రభుత్వం నిర్ణయించిన కాల నిర్ణయ పట్టికతో పాటు ప్రతి రోజు ఉదయం 8 :30 నుంచి 9:30 వరకు, సాయంత్రం 4:45 నుంచి 5:45 వరకు ఉదయం గంట, సాయంత్రం గంట చొప్పున తరగతులు నిర్వహిస్తూ పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థి 10వ తరగతి వార్షిక పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించి జిల్లా వందశాతం ఫలితాలు సాధించే విధంగా పక్కా ప్రణాళికతో విద్యార్థులను సంసిద్ధులను చేస్తున్నారు.

ఆరు పేపర్లు, ఏడు పరీక్షలకు అనుగుణంగా...

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షలు ఆరు పేపర్లుండగా ఏడు పరీక్షలు నిర్వహించేందుకు వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. గతంలో తెలుగు, హింది, ఇంగ్లీష్, సామాన్యశాస్త్రం, గణితం, సాంఘీక శాస్త్రం 6 సబ్జెక్టులకు ఆరు పరీక్షలు నిర్వహించగా ఈ ఏడాది నిర్వహించనున్న వార్షిక పరీక్షలకు సామాన్య శాస్త్రంను భౌతికరసాయనశాస్త్రం, జీవశాస్త్రం పేపర్లుగా విభజించి పరీక్ష నిర్వహించేందుకు షెడ్యూల్‌ను విడుదల చేశారు. దీంతో ఏడు పేపర్లకు అనుగుణంగా మాదిరి ప్రశ్నాపత్రాలు, వాటికి వచ్చే మార్కుల ప్రకారం విద్యార్థులను సంసిద్ధులను చేసేందుకు అన్ని చర్యలు చేపట్టారు. దీంతో డిసెంబరు చివరి నాటికి సిలబస్ పూర్తి చేయించిన విద్యాశాఖ జనవరి 2 నుంచి రెగ్యులర్ తరగతులలో సిలబస్ రివిజన్ చేయడంతో పాటు హెచ్ఎంలు ప్రత్యేక తరగతులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

● మృతులు వరంగల్ జిల్లా కేంద్రానికి చెందిన వారు ● మారేడుమిల్లి విహారయాత్రకు వెళ్తుండగా ఘటన

మహబూబాబాద్ రూరల్, జనవరి 2 : పాతచేదు జ్ఞాపకాలకు బై-బై చెప్పి, అంతా శుభాలు జరగాలని ఆనందంగా ఉండే నూతన సంవత్సరాది ఆరంభం రోజున జరిగిన రోడ్డు ప్రమాద ఘటన రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. వరంగల్ నుంచి మారేడిమిల్లి విహారయాత్రకు ఈ నెల 1వ తేదీన కారు మహబూబాబాద్ సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం తప్పించబోయి, చెట్టు కొనడంతో.. ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే.

వరంగల్ జిల్లా కేంద్రం మట్టెవాడ ప్రాంతానికి చెందిన యువకులు గుగ్గిళ్ల రవితేజ (29), వెంగళ సాయిరాం (27) సంగినేని సాయిరాం, పాకాల లక్ష్మణ్, సాయితేజ వరంగల్ నుంచి సోమవారం రాత్రి పొద్దుపోయాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా మారేడుమిల్లి విహారయాత్రకు రవితేజ కారులో బయలు దేరారు. మానుకోట జిల్లా కేంద్రానికి సమీపంలోని ఏటిగడ్డతండ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న చెట్టును కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జు కాగా, అందులో ప్రయాణిస్తున్న గుగ్గిళ్ల రవితేజ, వెంగళ సాయిరాంలు అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన ముగ్గురు సంగినేని సాయిరాం, పాకాల లక్ష్మణ్, జి.సాయితేజకు తీవ్ర గాయాలుకాగా, అంబులెన్స్‌లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముగ్గురికి ప్రథమ చికిత్స చేసిన అనంతరం, వారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు సూచించడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రవితేజ, సాయిరాం మృతదేహాలను జిల్లా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం మంగళవారం వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు మానుకోట టౌన్ సీఐ సతీష్ తెలిపారు.


గుగ్గిళ్ల రవితేజ, వెంగళ సాయిరాం (ఫైల్)

కొనసాగుతోన్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

కేసముద్రం, జనవరి 2 : గత బీఆర్ఎస్ పాలనలో నియంతృత్వ పోకడలతో ప్రజలు అణిచివేయబడ్డారని, ఆత్మగౌరవం కోసం ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించారని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. కేసముద్రం స్టేషన్, విలేజి, కల్వల గ్రామాల్లోని ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పార్టీ అరాచక పాలన సాగించిందని ఆరోపించారు. జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచులు భట్టు శ్రీను, ఎన్నమాల ప్రభాకర్, గంట సంజీవరెడ్డి, ఎంపీటీసీలు ఆగె మంజుల, కొమ్ము స్వాతి, సట్ల వెంకన్న, గంట అశోక్‌రెడ్డి, ఉప సర్పంచ్ ముత్యాల నాగమణిశివకుమార్, విలేజి గ్రామపార్టీ అధ్యక్షుడు పొలెపల్లి వెంకట్‌రెడ్డి, నోడల్ అధికారి సూర్యనారాయణ, డీఎల్పీవో గంగాభవాని, ఎంపీడీవో రవీందర్ రావు, కార్యదర్శి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల వినతి..

కేసముద్రంలో ప్రజాపాలనకు హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్‌కు సీనియర్ జర్నలిస్టులు తమ సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. జర్నలిస్టులకు ఇంటిస్థలాలు, ప్రమాద బీమాతో పాటు సాధారణ మరణానికి రూ.5 లక్షల బీమా, 60 ఏళ్లు దాటిన వారికి నెలకు రూ.10 వేల పింఛను ఇవ్వాలని ప్రభుత్వాన్ని వారు కోరారు.


ఇనుగుర్తిలో మాట్లాడుతున్న మురళీనాయక్

● ఇనుగుర్తి : పార్టీలకతీతంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలను ప్రతీ ఒక్కరికి అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. ఇనుగుర్తిలో మంగళవారం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, తహసీల్దార్ సూర్యనారాయణ, ప్రత్యేక అధికారి రామకృష్ణ, సర్పంచ్ దార్ల రాంమ్మూర్తి, ఎంపీటీసీ తమ్మడపల్లి రజినీకుమార్, కూరెల్లి సతీష్, భైరు అశోక్‌గౌడ్, గంజి రాజేందర్‌రెడ్డి, మురళి, యాకన్న, జిల్లా కార్యదర్శి చిన్నాల కట్టయ్య, కొట్టం మహేందర్‌రెడ్డి, కవిత, ప్రశాంత్, రాము, సుధీర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● గూడూరు : అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. గూడూరు ప్రజాపాలన గ్రామసభలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. కాగా, మర్రిమిట్ట, రాజన్‌పల్లి, అయోధ్యపురం, మట్టెవాడ, మచ్చర్లలో గ్రామసభలు నిర్వహించారు. జడ్పీ సీఈవో రమాదేవి, జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఖాసీం, సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్, హర్టికల్చర్‌జిల్లా అధికారి సూర్యనారాయణ, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీవో రోజారాణి, ఎంపీటీసీలు కత్తిస్వామి, నూకల రాధికసురేందర్, కార్యదర్శి బీమా, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

పదవీవిరమణ ఉద్యోగానికే..

● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

మహబూబాబాద్ టౌన్, జనవరి 2: పదవీవిరమణ అనేది ఉద్యోగానికే తప్ప ఉద్యమాలకు కాదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. మహబూబాబాద్ పెరుమాండ్లజగన్నాథం భవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం రైల్వే ఉద్యోగి, కార్మిక నాయకుడు గుండా వెంకటేశ్వర్లు పదవీవిరమణ అభినందనసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన నాగయ్య మాట్లాడారు. గుండా వెంకటేశ్వర్లు కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు పట్ల ఆకర్షితులై ప్రజాఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారని చెప్పారు. ఇటు ఉద్యోగాన్ని అటు ఉద్యమాన్ని రెండు కళ్లలా కాపాడుకుంటూ ముందుకు సాగారని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.రాములు మాట్లాడుతూ..వెంకటేశ్వర్లు ఎర్రజెండా పోరాటాల్లో కీలకంగా పని చేశారని చెప్పారు. అనంతరం గుండా వెంకటేశ్వర్లు దంపతులను ఘనంగా సన్మానించారు. సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు సూర్నపు సోమయ్య, ఆకుల రాజు, సమ్మెట రాజమౌళి, సామ మల్లారెడ్డి, దాశయ్య, జగదీష్, గునిగంటి రాజన్న, కోటయ్య, ప్రమీల, కుర్ర మహేష్, భాగ్యమ్మ, మచ్చ వెంకన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉరుకులు.. పరుగులు..

● ఆధార్, మీసేవ కేంద్రాల వద్ద రోజంత నిరీక్షణ

గూడూరు, జనవరి2 : మండలంలో ప్రజాపాలన కార్యక్రమానికి ఊహించని స్పందన లభిస్తోంది. కొత్తగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలు చేపట్టి ఆరు గ్యారెంటీ పథకాల అమలుకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ప్రజలు దరఖాస్తులు చేసుకునేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాలు రద్దీగా మారాయి దరఖాస్తులు చేయాలంటే విధిగా ఆధార్ ప్రాధాన్యత ఇవ్వ డంతో ప్రజాపాలన కౌంటర్ల నుంచి ఆధార్, మీసేవ కేంద్రాలకు ప్రజలు పరుగులు పెడుతున్నారు. అవసరాలను అసరా చేసుకున్న కొద్దిమంది మీసేవనిర్వాహకులు టోకెన్లను ముందస్తుగా జారీ చేస్తున్నారు. ఆ సమయంలో కొంత నిర్వా హకులు అధిక వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. చిన్నపిల్లల తల్లులు రోజంతా క్యూలైన్‌లో ఉండలేక ఇబ్బందులు పడుతున్నారు. మీసేవ కేంద్రాల నిర్వాహకులు అడిగినంతా డబ్బులు చెల్లిస్తే వారికి మొదటి ప్రాధాన్యతగా ఆధార్ కార్డు జారీ చక్కబెడుతున్నట్లు సమాచారం.

సింగరేణి సీఎండీగా బలరాంనాయక్ నియామకం పట్ల హర్షం

మహబూబాబాద్ టౌన్, జనవరి 2 : సింగరేణి సీఎండీగా సేనావత్ బలరాంనాయక్ నియామకం పట్ల యూత్ కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం బలరాంనాయక్ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీనాయక్ మాట్లాడారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రియాజ్ అన్సారీ, సందీప్‌రెడ్డి, సిద్దునాయక్, పింగ్రాల రాందాసు, మనోజ్, హసేన్ షబ్బీర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

● అభయహస్తానికి దరఖాస్తు చేసి వెళ్తుండగా ఘటన

లింగాలఘణపురం, జనవరి 2 : మండలంలోని వడ్డిచర్ల గ్రామం వద్ద జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా మండలం వీరారం శివారు కెలావత్ తండాకు చెందిన కెలావత్ నరేష్ (35) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నరేష్ హైదరాబాద్‌లో నివాసముంటూ ఓ తెలుగు దినపత్రికలో పని చేస్తున్నాడు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వీరారం గ్రామపంచాయతీలో మంగళవారం అభయహస్తం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు స్వగ్రామానికి వచ్చి తిరిగి వదిన కవితతో కలిసి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో వడ్డిచర్ల వీరభద్ర పెట్రోల్ బంక్‌వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీని బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నరేష్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందగా కవిత స్వల్పగాయాలతో బయటపడింది. నరేష్‌కు భార్య విమల, ఇద్దరు కుమారులు ఉన్నారు. లింగాలఘణపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం ట్రాక్టర్ బోల్తా


రంగాపురం క్రాస్‌రోడ్డు వద్ద బోల్తాపడిన ట్రాక్టర్ ట్రాలీ

కేసముద్రం, జనవరి 2 : మండలంలోని రంగాపురం క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం రాత్రి ధాన్యం లోడుతో స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు వస్తున్న ఒక ట్రాక్టర్ బోల్తాపడింది. ధాన్యంలోడ్‌తో మార్కెట్ వైపునకు వస్తున్న రెండు ట్రాక్టర్లు ఓవర్ టేక్ చేస్తున్న క్రమంలో ఎడమవైపున ఉన్న ట్రాక్టర్ రోడ్డుపైపు కిందకు జరిగి ట్రాలీ బోల్తాకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

కేసముద్రం, జనవరి 2 : కేసముద్రం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో హంగర్ రిలీఫ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉప్పరపల్లిలో అన్నదానం నిర్వహించారు. ఈనెల అంతా ప్రతీ రోజు మండలంలో ఏదో ఒక చోట అన్నదానం ఉంటుందని క్లబ్ అధ్యక్షుడు బెజ్జం ప్రేమ్‌కుమార్ తెలిపారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కటకం చంద్రశేఖర్, కార్యదర్శి పరాంకుశం శ్రీహరి, పాస్ట్ జడ్‌సీ యర్రం శ్రీరాములు, చింతా కరుణాకర్, శామకూరి నర్సయ్య, మడిపెద్ది వెంకటేశ్ పాల్గొన్నారు.

'ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలి'


రైల్వే పీసీసీఎం కేఆర్‌కే రెడ్డితో కేసముద్రం బీజేపీ నాయకుడు

కేసముద్రం, జనవరి 2 : కేసముద్రం రైల్వే స్టేషన్‌లో ఇంటర్‌సిటీ, మణుగూరు, కరీంనగర్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ కల్పించాలని మంగళవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ కేఆర్‌కే. రెడ్డి, డిప్యూటీ పీసీసీఎం భాస్కర్‌రెడ్డిలను స్థానిక బీజేపీ నాయకుడు వోలం శ్రీనివాస్ కలిసి విజ్ఞప్తి చేశారు. రైళ్ల హాల్టింగ్‌ను పరిశీలిస్తామని, ప్లాట్‌ఫాంపై డిస్‌ప్లే బోర్డులు, అప్ ప్లాట్‌ఫాంపై టికెట్ కౌంటర్ ఏర్పాటు కోసం వచ్చే వారంలో తాము కేసముద్రానికి వస్తామని హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు. అప్అండ్‌డౌన్ చేసే వారు మహబూబాబాద్ నుంచి కాకుండా కేసముద్రం నుంచి సీజన్ టికెట్లు తీసుకుంటే ఆదాయం అధికంగా నమోదై అభివృద్ధికి అనుకూలంగా ఉంటుందని ఆయన తెలిపారు.

'గార్లలో రైళ్లను ఆపాలి'

గార్ల : మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని కోరుతూ మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవితకు వినతి పత్రాన్ని పలు రాజకీయ పక్షాల నాయకులు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. అత్యధికంగా ఆదాయం కలిగిన గార్ల రైల్వేస్టేషన్‌లో, శాతవాహన, చార్మినార్, గౌతమి ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని వినతిపత్రాన్ని అందించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కందునూరి ఈశ్వర్‌లింగం, సంగిశెట్టి ప్రభాకర్, చంద్రశేఖర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.


కలెక్టర్ శశాంకకు వినతి పత్రాన్ని అందజేస్తున్న గోర్‌సేన నాయకులు

'ఫిబ్రవరి 15న సెలవు దినంగా ప్రకటించాలి'

మహబూబాబాద్ టౌన్, జనవరి 2 : సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని గోర్‌సేన జిల్లా అధ్యక్షుడు బోడ హరిలాల్‌నాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో జిల్లా కలెక్టర్ శశాంకకు మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా హరిలాల్‌నాయక్ మాట్లాడుతూ తెలంగాణలో ఒకే భాష, సంస్కృతి, సంప్రదాయం, వేషధారణ కలిగి ఉన్న గోర్‌బంజార ప్రజలు సుమారు 50 నుంచి 60 లక్షల మంది నివసిస్తున్నారని చెప్పారు. గోర్‌బంజారాల ఆరాధ్యదైవం శ్రీసంతు సేవాలాల్ మహారాజ్ జయంతిని వచ్చేనెల 15న పండుగలా జరుపుకుంటామని ఆ రోజు సెలవుదినంగా ప్రకటించాలని కోరారు. తమ డిమాండ్‌ను ప్రభుత్వం స్వీకరించి అమలు చేయాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బానోత్ సురేష్, లావుడ్య సాగర్, గణేష్, రాజ్‌కుమార్, గుగులోతు సాయి, అజ్మీర సాయి, బి.నవీన్, అనిల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వ్యాయామ ఉపాధ్యాయుడు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 2 : హైదరాబాద్‌లో ఫిబ్రవరి 8వ తేదీ నుంచి 11 వరకు జరిగే జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వ్యాయామ ఉపాధ్యాయుడు మహంకాళి వెంకటేశ్వర్లు ఎంపికైనట్లు ఈదులపూసపల్లి ప్రధానోపాధ్యాయుడు పూజారి వీరయ్య తెలిపారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధి ఈదులపూసపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల స్థానిక పాఠశాలలో మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో డిసెంబరు 30, 31 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-40 విభాగం 5 కిలోమీటర్ల వాకింగ్ విభాగంలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రజిత పతకం సాధించి, జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, పీటర్ ప్రవీణ్‌కుమార్, రామ్మోహన్‌రావు, ఉప్పలయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఓంప్రకాష్, స్వప్న, కోటయ్య కామేశ్వర్‌రావు, వీరేందర్, భాగ్యలక్ష్మీ, శ్రీదేవి తది తరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 2 : ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులను గుర్తించి సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రజాపాలనకు శ్రీకారం చుట్టిందని, ఈ ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్రహ్మణపల్లి లక్ష్మీపురం సర్పంచ్ షఫీయొద్దీన్ అన్నారు. మహబూబాబాద్ మండలం బ్రహ్మణపల్లి లక్ష్మీపురం, మాధవాపురం, సింగారం, ఇస్లావత్‌తండా (ఎస్), లక్ష్మీపురంతండా, ఇస్లావత్‌తండా (ఎం)లలో ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సర్పంచులు బొబ్బ పద్మావెంకట్‌రెడ్డి, గంగుల తేజమ్మ, ఇస్లావత్ నరేష్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్సై దీపికరెడ్డి, ఎంపీవో హరిప్రసాద్, పీఆర్ఏఈ రాజశేఖర్, ఎంపీఎం తిలక్, సీసీ సుమలత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● డోర్నకల్ : అర్హులైన లబ్ధిదారులను గుర్తించి సంక్షేమపథకాల మంజూరు కోసం ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నాగభవాణి, ఎంపీడీవో చలపతిరావు అన్నారు. చిల్కోడు, వెన్నారం, పెరుమాండ్ల సంకీస, ఉయ్యాలవాడలో ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రాయల వెంకటబాబు, బొబ్బ లక్ష్మీ, నున్న జయలక్ష్మీ, ప్రత్యేక అధికారి నర్సింహామూర్తి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

డోర్నకల్, జనవరి 2 : డోర్నకల్ మండలంలోని ముల్కలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న తిరుమలాయపాలెం, ముల్కలపల్లి వరకు తారురోడ్డు మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం సర్పంచ్ జవ్వాజీ రాంప్రసాద్ విజ్ఞప్తి చేశారు. పాలేరు నియోజకవర్గంలో జరుగుతున్న ప్రజాపాలనలో పాల్గొనేందుకు ముల్కలపల్లి మీదుగా వెళ్తున్న మంత్రిని కాంగ్రెస్ మండల అధ్యక్షులు జగదీష్‌తో పాటు సర్పంచ్ రాంప్రసాద్ మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి తారురోడ్డు మంజూరు కోసం విన్నవించారు. త్వరలోనే సమస్యలకు పరిష్కారం చూపుతానని మంత్రి తెలిపినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాప్‌చంద్, బిక్నానాయక్, ఎన్నబోయిన శేషయ్య, తుక్లూరి శోభన్‌బాబులు ఉన్నారు.


ముల్కలపల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

'హక్కులకు భంగం కలిగించొద్దు'

బయ్యారం, జనవరి 2 : ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన హక్కులకు భంగంకలిగించేచర్యలు మానుకోవాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు కొర్స నరేష్ కోరారు. ఏజెన్సీలో గిరిజనేతరుల హక్కుల కోసం పలువురు గిరిజనేతరులు సోమవారం రిలేదీక్ష చేపట్టడం సరికాదని, దీనిని ఆయన ఖండించారు. మంగళవారం బయ్యారంలో జరిగిన ఆ సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని సహజ సిద్ధమైన వనరులపై హక్కులను రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించినట్లు పేర్కొన్నారు. కొందరు షెడ్యూల్డ్ ప్రాంతంలోని 1/70 చట్టాన్ని తుంగలో తొక్కుతూ.. రియల్ ఏస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. జంపయ్య, కోటేశ్వరరావు, కిషిందర్, కృష్ణరాంమూర్తి, సాగర్, బాబురావు, పాపారావు, వెంకన్న, సమ్మయ్య పాల్గొన్నారు.

'అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి'

గార్ల, జనవరి 2 : మండల కేంద్రంలో ఏజెన్సీ హక్కులకు భంగం కలిగిస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా తమ ఇష్టారాజ్యాంగా వెంచర్లు వేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న యజమానులపై చర్యతీసుకొని, వెంచర్లను నిలుపుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గార్లలో అక్రమ వెంచర్ల అనుమతులను రద్దు చేయాని కోరుతూ సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి, డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్‌కు వినతి పత్రం అందించారు. జంపాల వెంకన్న. పోతుల నర్సింహారావు, మాగం లోకేశ్, పల్లా కోటి, జనార్దన్ పాల్గొన్నారు.

'దరఖాస్తులతోనే నిరుపేదలకు న్యాయం'

కురవి, జనవరి 2 : ప్రజాపాలనలో నిరుపేదలు దరఖాస్తు చేసుకోవడం ద్వార సంక్షేమ పథకాలను లబ్ధిపొందవచ్చునని తహసీల్దార్ సునీల్‌రెడ్డి అన్నారు. కురవితో పాటు తులిస్యతండా, జగ్యతండా, రేకులతండా, మొగిలిచర్ల, నారాయణపురం గ్రామాల్లో మంగళవారం ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. ఎంపీడీవో సరస్వతి, ఎస్సై గోపి, ఎంపీవో రఘుపతిరావు, ఏవో మంజుఖాన్, ఏఈవో రాజేశ్వరి, ఆర్ఐ లక్ష్మి పాల్గొన్నారు.

ఏఎస్సై సదయ్యకు సేవా పతకం



కురవి, జనవరి 2 : కురవి ఏఎస్సై సదయ్యకు పోలీస్‌డిపార్ట్‌మెంట్ సేవా పథకం లభించింది. విధి నిర్వహణలో ఎటువంటి తప్పులు దొర్లకుండా వ్యవహరించిన ఉత్తమ ఉద్యోగులను సేవా పథకానికి ఎంపిక చేస్తారు. మహబూబాబాద్ జిల్లాలో సివిల్ పోలీసుల నుంచి సదయ్యకు సేవా పతకం కింద ఎంపిక చేశారు. జనవరి 26న సదయ్యకు సేవా పతకాన్ని అందజేస్తారు. మహబూబాబాద్ రూరల్ ఎస్సై రమేష్, ఎస్సై గోపి అభినందించారు.

అధికార పార్టీకి చెందిన ఫ్లెక్సీల ధ్వంసం


కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫెక్సీని చించివేసిన దృశ్యం

మరిపెడ రూరల్, జనవరి 2 : గుర్తు తెలియని వ్యక్తులు అధికార పార్టీకి చెందిన ఫ్లెక్సీలను ధ్వంసం చేసి, కాలపెట్టారని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కొట వెంకటరెడ్డి, పెద్దబోయిన ఐలమల్లు తెలిపారు. మంగళవారం ఈ సందర్భంగా వారు మాటాడుతూ బుర్హాన్‌పురంలో అధికార పార్టీ అధినేత్రి సోనియాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్, వరంగల్ మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డిల ఫ్లెక్సీలు గ్రామంలోని మూడు ప్రదేశాలలో ఇటీవల ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. అయితే మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఫ్లెక్సీలను చించివేసి, అనంతరం కాలపెట్టారన్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

మరిపెడ రూరల్, జనవరి 2 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తహసీల్దార్ సైదులు తెలిపారు. మంగళవారం మండలంలోని గుండెపుడిలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై గ్రామ సభను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అర్హులైన వారికి ఆరు గ్యారెంటీలైన మహాలక్ష్మీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, చేయూత వంటి పథకాలు గురించి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నూకల కిషన్‌రెడ్డి, ఎంపీటీసీ ఫులుసు చిరంజీవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సూరబోయిన ఉప్పలయ్య, బాబు, రవి పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


రబియాబీ (ఫైల్)

మరిపెడ, జనవరి 2 : మరిపెడ మునిసిపాలిటీకి చెందిన శతాధిక వృద్ధురాలు ఎస్కే.రబియాబీ (110) మంగళవారం మృతి చెందింది. నేటి వరకు ఆమె ఇతరులుపై ఆధారపడకుండా తన పనులు తానే చేసుకునేదని కుటుంబ సభ్యులు తెలిపారు. పాతతరానికి చెందిన శతాధికవృద్ధురాలు రబియాబీ మృతి చెందిన విషయం తెలుసుకున్న స్థానికులు పలువురు సంతాపం తెలిపారు. మృతురాలికి నలుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెల సంతానం కాగా, ఆమె తన కుటుంబలో ఐదో తరం వారిని కూడా చూసింది. ఈ ఐదు తరాలకు చెందిన సుమారు 300మంది కుటుంబసభ్యులు ఉన్నారు.

సర్కారు పథకాలను ప్రజలకు అందేలా కృషి చేయాలి : ఎమ్మెల్యే


దరఖాస్తును స్వీకరిస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, జనవరి 2 : ప్రభుత్వ పథకాలు ప్రజలు అందించేందుకు అన్ని విదాలుగా కృషి చేయాలని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని 16వ వార్డు పరిధిలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కౌంటర్‌ను ఆమె సందర్శించి అధికారులకు తగు సూచనలు చేశారు. మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కమిషనర్ సరస్వతి, కాంగ్రెస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్ రెడ్డి, కౌన్సిలర్లు తూనం రోజా ప్రభుదాస్, రాము, గజానంద్, రేవతి శంకర్, శ్రీనివాస రావు, గుగులోత్ శంకర్ పాల్గొన్నారు.

పాపన్న స్ఫూర్తితో ముందుకు సాగాలి..

బడుగుల ఆశాజ్యోతి, పరిపాలన దీక్షకుడు సర్వాయి పాపన్న స్ఫూర్తితో పరిపాలనలో ముందుకు సాగుతానని ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహంవద్ద గౌడ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. శేఖర్, స్వామి, రమేష్, యాదగిరి, రాంమ్మూర్తి, కుర్ర శ్రీను, రమేష్, యాకయ్య, శ్రీను, అశోక్ పాల్గొన్నారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి


దరాఖాస్తులను స్వీకరిస్తున్న జడ్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయి సుధీర్

పెద్దవంగర, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఈదురు రాజేశ్వరి, జడ్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయి సుధీర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు చిట్యాల. చిన్నవంగర, ఉప్పరగూడెం గ్రామాలలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలనుఅందించాలన్నారు. మండల ప్రత్యేకాధికారి ఖుర్షీద్, తహసీల్దార్ మహేందర్, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ వి.రామచంద్రయ్యశర్మ, ఎంపీవో సత్యనారాయణ, ఏపీవో రమణాచారి, సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, దుంపల జమునా, లక్ష్మీ, ఆర్ఐ లష్కర్, ఉపసర్పంచ్ రాము, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరు దరఖాస్తు చేసుకోవాలి

● మరిపెడ మునిసిపల్ కమిషనర్ రాజు

మరిపెడ, జనవరి 2 : అభయ హస్తం ఆరు గ్యారెంటీల అమలు కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని మరిపెడ మునిసిపల్ కమిషనర్ ఏ.రాజు అన్నారు. మంగళవారం మరిపెడ మునిసిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో ప్రజాపాలన వార్డు సభ నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 6వ తేదీ వరకు దరఖాస్తులను ఆయా వార్డు అధికారులకు అందచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ ముదిరెడ్డి బుచ్చిరెడ్డి, స్థానిక కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



చిన్నగూడూరు, జనవరి 2 : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మంగళవారం మండల కేంద్రంలోని పిల్లి ఎల్లయ్య పొలంలో చోటు చేసుకుంది. రైతు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉగ్గంపల్లి శివారు బంక తండా రైతు బానోత్ హచ్యాకు చెందిన పాడిగేదె రోజులానే మండల కేంద్రం శివారు పొలాలలో మేతకు తీసుకెళ్లగా మేత మేస్తూప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. రూ.50 వేల విలువైన గేదె మృతి చెందిందని, తనకు ప్రభుత్వం తరుపున నష్ట పరిహారం అందివ్వాలని బాధిత రైతు కోరారు.